# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు జైపూర్‌లో నిర్వహించే "రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ సమ్మిట్ 2024"ను ప్రారంభిస్తారు.

2. **ఆంధ్రప్రదేశ్ లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈరోజు ఆవిష్కరించనున్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు నగరాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

5. **తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రాజస్థాన్, హర్యానాలో పర్యటించనున్నారు. రాజస్థాన్ పర్యటన సందర్భంగా జైపూర్ లో "రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ సమ్మిట్ 2024"ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం పానిపట్ లో ప్రధానమంత్రి బీమా సఖీ యోజనను ప్రారంభిస్తారు. మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు సాధికారత కల్పించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. అదే విదంగా హర్యానాలోని కర్నాల్‌లో మహారాణా ప్రతాప్ హార్టికల్చరల్ ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రధాన ప్రాంగణానికి కూడా నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు.

--------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లను ఆదేశించారు. అమరావతి నుంచి దృశ్య మాధ్యమం ద్వారా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంట పొలాల్లో ఉన్న పంట ఉత్పత్తులు తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందజేయాలని తెలిపారు. వరి కోతల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకునేలా వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు నగర పరిధిలో 77.29 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని స్థానిక 46, 47వ డివిజన్లలో రహదారుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు గత సాయంత్రం శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గుంటూరు శివారు ప్రాంతాల్లో ప్రధానమైన తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. రాబోయే ఆరు నెలల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---

హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను రచించిన కవి అందెశ్రీని, తెలంగాణ తల్లి విగ్రహ రూపకర్తలు ప్రొఫెసర్ గంగాధర్, రమణారెడ్డిలను ప్రభుత్వం తరఫున సన్మానించనున్నారని, విగ్రహావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని, అధికారులు తెలిపారు.

---

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకూ జరగనున్న మహా కుంబమేళాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేస్తోంది. అందులో భాగంగా ఈశాన్య రైల్వే వారణాసి డివిజన్ పరిధిలోని ఝుసీ రైల్వే స్టేషన్‌ను రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ నిన్న పరిశీలించారు. విండో ట్రెయిలింగ్ రైలు ద్వారా భారతీయ రైల్వే మహా కుంబమేళాకు చేపడుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కుంభమేళాకు దేశ నలుమూల నుంచైనా రైళ్లను నడుపుతున్నామని తెలిపారు.

---

డ్రోన్ కెమెరాలతో మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు. విశాఖపట్నంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విశాఖపట్నంలో రహదారి ప్రమాద బాధితులకు సహకార కేంద్రం ప్రారంభించామని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితుల సహాయానికి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పరంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నగరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, నూతనంగా ముఖ గుర్తింపు వ్యవస్థను కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు.

---

తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు శాసన సభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ బీఏసీ సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో సభను ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే ఈ సమావేశాల్లో నూతన ఆర్ఓఆర్ చట్టం, కులగణన, బీసీ రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు పలు కొత్త చట్టాలపై చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---

తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. కాకినాడ జేఎన్టీయూ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. ఇందుకు సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 14 బల్లలను ఏర్పాటు చేశామన్నారు. 9 రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

రైతులకు ఉపయోగపడేలా ధరణి సమస్యల పరిష్కారానికి కొత్త యాప్, చట్టాన్ని అందుబాటులోకి తెస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజా పాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ, కొత్త చట్టాన్ని శాసనసభ సమావేశాల్లో ఆమోదింపజేస్తామన్నారు. త్వరలోనే సర్వే వ్యవస్థను కూడా పటిష్ఠం చేస్తామని, ఇందుకోసం 1000 సర్వేయర్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి తెలుపుతూ,

(వాయిస్….30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు ఎప్పటినుంచో జరుగుతున్నాయని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం పేరుమార్చి ప్రచారం చేసుకుంటోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై యస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పేరెంట్–టీచర్ సమావేశంపై ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. తమ ప్రభుత్వ హయంలోనూ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించామని తెలిపారు. విద్యా వ్యవస్థలో చేపట్టిన మార్పులు, అమలు చేసిన సంస్కరణల్లో తల్లిదండ్రుల్ని భాగస్వామ్యం చేశామని పేర్కొన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయడానికి గతంలో చేపట్టిన పనులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.

---------------------------

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ నెల 11 ,12 తేదిల్లో ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. తెలంగాణలోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

భారత తొలి జలాంతర్గామి ఐఎన్ఎస్ కల్వరి 57వ వార్షికోత్సవాన్ని తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో గత సాయంత్రం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో ఘనంగా నిర్వహించారు. 1967 డిసెంబరు 8న ఐఎన్ఎస్ కల్వరిని జాతికి అంకితం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని బీచ్‌లోని జలాంతర్గామి మ్యూజియం ప్రాంగణంలో నిన్న ఛాయాచిత్ర, యుద్ధపరికరాల నమూనాల ప్రదర్శనను నౌక దళ అధికారులు ఏర్పాటు చేశారు.

---------------------------

టీఫైబర్ ద్వారా తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజా విజయోత్సవాల్లో టీఫైబర్ సేవలను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీ ఫైబర్ ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీలను వినియోగించవచ్చని తెలిపారు. ఈ సేవలను పరిశీలించి మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామన్నారు.

======================